# వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

బుధవారం 14 డిసెంబర్ 2022


## సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



పులివెందుల రూరల్, డిసెంబరు 13, ప్రభాతవార్త :

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23 నుండి 25వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారని, ఇందులో భాగంగా పులివెందులలో సంబంధిత పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు విజయ్‌రామరాజు ఆదేశించారు. మంగళవారం పులివెందులలో ఆయన పర్యటించారు. పులివెందులలోని టీటీడీ కల్యాణ మండపంలో రూ.33కోట్లతో నిర్మించిన నూతన ఆర్టీసీ నిర్మాణ పనులను మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఇందిరమ్మ రాణితోపులో నిర్మిస్తున్న నగరవనాన్ని ఆయన పరిశీలించారు. శిల్పారామంలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను ఆయన పరిశీలించారు. పలుచోట్ల జరుగుతున్న పనులను ఆయన చూసి సీఎం ప్రారంభించే అభివృద్ధి పనులకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో వెంకటేశులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి.డిసెంబర్ 13 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరయిన నలుగురు లబ్దిదారులకు 3.10 లక్షల విలువచేసే చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. లక్కిరెడ్డిపల్లి మండలం సికె దిన్నె పల్లెకు చెందిన కమ్మెటి సావిత్రమ్మకు 60 వేలు, రాయచోటి మండలం పెమ్మాడపల్లి మొరవవడ్డెపల్లెకు చెందిన కోటకొండ వెంకటేశ్వర్లుకు 20 వేలు, రామాపురం మండలం పొత్తుకూరుపల్లి కొండ్రెడ్డిగారిపల్లికు చెందిన పూతి రెడ్డి, సుబ్బారెడ్డికి 1.20 లక్షలు, మున్సిపాలిటీలోని రెడ్డివారిపల్లికు చెందిన దండు శివమ్మకు 1.10 లక్షలు విలువ చేసే చెక్కులను శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారాన్ని మరువ లేమని సిఎం సహాయనిధి చెక్కులు అందుకున్న లబ్దిదారులు పేర్కొన్నారు. తమకు ఆరోగ్యాలు బాగలేక, వైద్యా నికి అప్పులు చేసి ఖర్చులు పెట్టుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తరుణంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రెస్కో చైర్మన్ క్రిష్ణారెడ్డి, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సిపి మదనపల్లి నియోజవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్, కో ఆప్షన్ సభ్యులు అయ్యవారురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బద్వేలులో కల్వర్టులు ఆక్రమణ

### రాజకీయ అండతో యధేచ్ఛగా ఆక్రమణలు - కల్వర్టులపై నిర్మాణాలు

### నేషనల్ హైవే పై కల్వర్టు తొలగింపు - స్పందించిన అధికారులు



తొలగించిన కల్వర్టు.కల్వర్టును పరిశీలిస్తున్న తహసీల్దారు, అధికారులు.

బద్వేలు, డిసెంబరు 13 ప్రభాతవార్త :

బద్వేలు పట్టణంలో కల్వర్టులన్నీ పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. కొన్ని సంవత్సరాలుగా చెరువులకు సంబంధించిన పంట కాలువలు వెళ్ళే కల్వర్టులు, యదేచ్ఛగా ఏర్పడిన కల్వర్టులు ఉండకూడదని భావించిన రాజకీయ నాయకులు వాటిని తొలగిస్తూ వాటిపై నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణంలో నాలుగు రోడ్లల్లో ఉన్న కల్వర్టులన్నీ దాదాపు ఆక్రమణకు గురయ్యాయి. మంగళవారం మైదుకూరు రోడ్డు నేషనల్ హైవే పై ఉన్న కల్వర్టులను పూర్తిగా తొలగించేందుకు కొంత మంది ప్రయత్నించడం జరిగింది. ఇప్పటికే ఈ కల్వర్టుపై నిర్మాణాలు చేపట్టడమేగాక అడ్డంగా ఉన్న కల్వర్టును తొలగిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదనే ఉద్దేశ్యంతో పథకం ప్రకారం కల్వర్టు తొలగింపునకు శ్రీకారం చుట్టారు. దీంతో రెవిన్యూ అధికారులు స్పందించారు. మైదుకూరు రోడ్‌లో ఉన్న కల్వర్టు కొన్నేండ్లుగా ఉన్న ఈ ప్రభుత్వ స్థలాన్ని ఏ విధంగా రిజిష్టర్ చేసి నిర్మాణాలు చేపట్టారనేది ప్రశ్నార్థకంగా మారింది. రాజకీయ బలం, ధన బలం ఉంటే ఏదైనా బద్వేలులో రిజిష్టర్ చేయించుకునే అవకాశం ఉండడంతో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, కల్వర్టులపై కన్నేశారు. ఎవరి బలం ఏమిటో సత్తా చూపుకునేందుకు కల్వర్టులు ఆక్రమిస్తూ దర్జాగా ఉన్నారు. అయితే ఇంత జరుగుతున్నా రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవడంగానీ, నోటీసులు జారీ చేయడం గానీ జరగలేదు. ఇదే అదునుగా భావించిన ఆక్రమణదారులు వాటికి అనుమతులు తెచ్చుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. కల్వర్టులకు రిజిష్టర్ ఎలా చేయడం జరుగుతుంది. పూర్వ కాలం నుండి ఉన్న పంట కాలువలపై ఉన్న కల్వర్టులు నీటి ప్రవాహంతో ప్రవహిస్తూ ఉండే వాటిపై ఉన్న కల్వర్టులు ఏ విధంగా ప్రైవేటు వ్యక్తుల పరం అవుతాయి. వీటికంటూ ఒక చట్టం ఉండదా? రెవిన్యూ కార్యాలయంలో ఆర్‌ఎస్‌ఆర్ బయటికి తీస్తే పూర్తి వివరాలు బయటికి వస్తాయి. కానీ అంత లోతుగా వెళ్ళే అధికారులు ఎవరున్నారు? భూ కబ్జాదారులకు ప్రభుత్వ స్థలాలు అక్రమంగా కట్టబెట్టడానికే అధికారులు పని చేస్తున్నట్లు కనపడుతుంది తప్ప ప్రభుత్వ ఆస్తులు కాపాడే పరిస్థితి కనపడడం లేదు. సిద్దవటం రోడ్‌లో, నెల్లూరు రోడ్‌లో, మైదుకూరు రోడ్‌లలో ఉన్న ప్రధాన కల్వర్టులన్నీ ఆక్రమణలకు గురైన ఏ అధికారి పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. నేషనల్ హైవేపై ఉండడంతో వాటి విలువ లక్షల్లో ఉన్నప్పటికీ వాటిని ఆక్రమణదారులకు కట్టబెట్టే ప్రయత్నాలు జరిగాయి తప్ప వారిపైన చర్యలు తీసుకున్న పాపాన పోలేదని ఆరోపిస్తున్నారు. ఒక పథకం ప్రకారం కల్వర్టులన్నీ ఆక్రమణకు గురవుతూ వస్తున్నాయి. ఇప్పటికే బద్వేలులో చెరువులు, కుంటలు నెమ్మదిగా ఆక్రమించుకుంటూ వెళుతుంటే ఇప్పుడు కల్వర్టులపై దృష్టిపెట్టారు. కల్వర్టులపై నిర్మాణాలు చేపట్టడమేగాక కల్వర్టులు అనే ఆనవాళ్ళు లేకుండా చేసేందుకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

**కల్వర్టును పరిశీలించిన తహసీల్దారు మల్లిఖార్జునరెడ్డి**

జాతీయ రహదారిపై ఉన్న కల్వర్టును మంగళవారం తొలగించడంతో తహసీల్దారు మల్లిఖార్జున రెడ్డి, రెవిన్యూ అధికారులు, నేషనల్ హైవే అధికారులు పరిశీలించారు. వీటిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించారు. పూర్వాపరాలను పరిశీలించి కల్వర్టులపై జరిగిన నిర్మాణాలను పరిశీలిస్తామని తహసీల్దారు మల్లిఖార్జున రెడ్డి తెలిపారు.

## కొండలు కొల్లగొడుతున్నా కళ్లు కనిపించలేదా? నిద్రపోతున్నారా?

### 'పోలి' కొండ అక్రమాలపై కలెక్టర్ గిరీషా 'ఫైర్'

### తహశిల్దారు, ఆర్‌డిఒలపై అగ్రహం



పోలి కొండలను ధ్వంసం చేసిన ప్రాంతంలో కలెక్టర్ గిరీషా

రాజంపేట అర్బన్, డిసెంబరు 13 ప్రభాతవార్త

ప్రకృతి రమణీయంగా కనిపించే కొండలను భారీ యంత్రాలతో నామరూపాల్లేకుండా చేశారు. పట్ట పగలు కొండలను కొల్లగొట్టారు. ధ్వంసం చేశారు. ప్రభుత్వ భూముల్లోని కొండలని మీకు తెలియదా? కళ్లు కనిపించలేదా? మీరేమనుకొన్నారు? నన్నేం చేయాలనుకొన్నారు. అసలేం చేస్తున్నారు ప్రజలకు ఏం జవాబు చెబుతారంటూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా ఫైర్ అయ్యారు. మంగళవారం రాజంపేట పట్టణానికి 2 కిలోమీటర్ల దూరంలోని పోలిచెరువు కట్ట సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొండలను పిండి చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు రోడ్లు వేశారు. దీనిపై పత్రికలలో, మీడియాలో పెద్దఎత్తున కథనాలు వచ్చాయి. కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై స్పందించిన కలెక్టర్ పోలి కొండ అక్రమాలపై స్వయంగా పరిశీలించి అగ్రహోక్తులయ్యారు. తహశిల్దారు, ఆర్‌డిఒలపై విరుచుకుపడ్డారు. కొండలు ధ్వంసం చేసిన వైనం చూసి మండిపడ్డారు. మీరేం చేస్తున్నారు, మీకు ఈ విషయం తెలియదా? ఉద్యోగం చేయడం లేదా? ఇంత పెద్దఎత్తున కొండలను నాశనం చేస్తుంటే నిద్రపోతున్నారా? ఇవేమైనా పట్టా భూములా? కాదు సార్.. అలాగైతే ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కొండలను కొల్లగొట్టి రోడ్డు వేస్తూ వ్యాపారం చేస్తుంటే ఏమి చేస్తున్నారంటూ తహశి ల్దారుపై మండిపడ్డారు. అక్కడే ఉన్న ఆర్‌డిఒను కూడా కలెక్టర్ ప్రశ్నించారు. తహశిల్దారు పట్టించుకోలేదు, కనీసం మీరైనా తెలుసుకోవాలి కదా అని ప్రశ్నించినట్లు తెలిసింది. పోలి కొండ అక్రమాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. విచారణాధికారిగా జాయింట్ కలెక్టర్‌ను సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన రికార్డులు మొత్తం కలెక్టరేట్‌కు తీసుకురావాలని కలెక్టర్ స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. కలెక్టర్ తీవ్ర ఆగ్రహంతో స్థానిక రెవెన్యూ అధికారులు నివ్వెరపోయారు. తాను రాకమునుపు నుంచే ఈ పనులు జరుగుతున్నాయని తహశిల్దారు ఎంవి సుబ్రమణ్యంరెడ్డి ఆర్‌డిఒ కోదండరామిరెడ్డికి వివరించినట్లు తెలిసింది. కలెక్టర్ సీరియస్ యాక్షన్‌కు ఎవరిపై వేటు పడుతుందో వేచి చూడాల్సిందే.

## తుఫానుతో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించిన కలెక్టర్ గిరీషా

రాజంపేట మండలంలోని హస్తవరం గ్రామంలో మాండూస్ తుఫాను వల్ల దెబ్బతిన్న అరటి తోటలను మంగళవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాండూస్ సైక్లోన్ వల్ల అరటి పంటకు జరిగిన నష్టాన్ని గురించి రైతులతో, ఉద్యాన అధికారులతో చర్చించారు. పంటనష్టం నివేదికలను త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వానికి పంపాల్సిందిగా అధికారులను ఆదేశించారు. జిల్లా ఉద్యాన అధికారి బి.రవిచంద్రబాబు జిల్లావ్యాప్తంగా 282 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని. అందులో ప్రధానంగా రాజంపేట పరిధిలో 132 హెక్టార్లలో అరటి పంట దెబ్బతిన్నట్లు కలెక్టర్‌కు వివరించారు. అలాగే ఉద్యాన పంటలకు జిల్లా మొత్తంగా దాదాపుగా 5.50 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు తయారు చేశామని కలెక్టర్‌కు తెలిపారు. అరటిసాగు వల్ల ఉండే కష్టనష్టాల గురించి సాగు చేసే రకాలు, మార్కెటింగ్, డ్రిప్ ద్వారా ఎరువుల వాడకం గూర్చి ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి బి.రవిచంద్రబాబు, ఎడిఎ రమేష్‌బాబు, హెచ్‌ఒ సురేష్‌బాబు, తహశిల్దారు సుబ్రమణ్యంరెడ్డి, విహెచ్‌ఎలు రామ్మోహన్‌రాజు, శివప్రసాద్, విఆర్‌ఒ మాబుసేన్, గ్రామ సర ్పంచ్ మహీంద్రారెడ్డి, ఉపసర్పంచ్ నరసింహరాజు, రైతులు రామచంద్రరాజు, శివరామరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి

### - నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



కడప క్రైం, డిసెంబరు 13, ప్రభాతవార్త:

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. పోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో ఛార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు. 174 సీఆర్ పీసీ (అనుమానాస్పద మృతి) కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిఘా పెంచాలన్నారు. నిషేధిత గుట్కా, దేశీ అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్‌హెచ్‌ఆర్‌సీ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని పోలీసు అధికారులను ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ తుషార్ డూడి, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# రాయచోటిని పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తాం

### -ప్రభుత్వ గెస్ట్ హౌస్, డిస్పీ కార్యాలయ భవన నిర్మాణాల పరిశీలనలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి.డిసెంబర్ 13 ప్రభాతవార్త

అభివృద్ధి చెందిన పట్టణాలకు ధీటుగా రాయచోటిని అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అద్యక్షులు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ గెస్ట్ హౌస్ భవన నిర్మాణాలను మరియు డిఎస్పీ రెసిడెన్సియల్ కమ్ కార్యాలయ భవనాలను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పట్టణంలో డ్వాక్రా కార్యాలయం నిర్మాణానికి రూ.9లక్షలతో చేపట్టిన నిర్మాణ పనులు ఆగిపోయాయని జిల్లా కేంద్రంలో వివిఐపిలు, విఐపిలకు తగిన బస వసతులు లేవనే ఉద్దేశ్యంతో అత్యంత సుందరంగా ప్రభుత్వ గెస్ట్ హౌస్ నిరి ్మంచేందుకు 1.30 కోట్ల రూపాయల నిధులతో కలెక్టర్ గిరీషా ఆద్వర్యంలో ప్రణాళికాబద్దంగా యుద్ద ప్రాతిపదికన నిర్మాణపనులును పరిశీలించి అత్యంత సుందరంగా నిర్మాణాలను చేపట్టనున్నారు. ఈ నిర్మాణ పనులు ఈ నెలాఖరులోగా పూర్తవుతాయన్నారు. పచ్చని మొక్కలు ఆహ్లాదకరమైన వాతావరణంలో మంచి విద్యుత్ దీపాలంకరణతో పెద్ద నగరాలలో ఉన్న ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లకు మాత్రము తీసిపోనివిధంగాత్వరలో గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తామన్నారు. డిఎస్పీ కార్యాలయం మరియు రెసిడెన్సీ భవన నిర్మాణపు పనలు కూడా వేగవంతం చేయాలని ఫిబ్రవరిలోగా ఈ పనులు పూర్తవ్వాలని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలు కూడా మార్చికల్లా పూర్తి చేస్తామన్నారు. నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి త్వరగా ప్రారంభిస్తామన్నారు. ఠాణా వద్ద పెండింగ్ రహదారి విస్తరణ పనులు ఈ వారంలో ప్రారంభమవుతాయన్నారు. పట్టణంలోని గున్నికుంట్ల రహదారి విస్తరణ అభివృద్ధి పనులు పూర్తయ్యాయన్నారు. ఈ పనులన్నింటిని ప్రణాళికాబద్దంగా అధికారులు సహాయ సహకారాలతో ముందుకు నడిపించగలుగుతున్నామన్నారు. ఈ అభివృద్ధి పనులన్నీ చూస్తున్నప్పుడు మనుసుకు సంతోషం, ఆనందం కలిగిందని శ్రీకాంతరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, ఆర్అండ్‌బి మున్సిపల్, ప్రజారోగ్య ఇంజనీరింగ్ అధికారులు, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, ఫయాజ్ అహ్మద్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలకు అరటి తోటలు నేలమట్టం

### గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న జామ రైతులు



కాశినాయన, డిసెంబరు 13

ప్రభాతవార్త :

మండలంలో సుమారు 1000 హెక్టార్లలో అరటి సాగు చేశారు. గత 3 సంవత్సరాల నుండి అరటిలో సుగంధం అనే పంటను ఎక్కువగా సాగు చేశారు. కొద్దిపాటి వర్షం మరియు స్వల్ప గాలికే చేతికొచ్చిన పంటలో సగం అరటి గెలలు కింద పడి ఇటీవల ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండడంతో పంటను అమ్ముకోలేక, కిందపడిన గెలలు వ్యాపారస్తులు కొనుగోలు చేయకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని మండలంలోని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పంటను పరిశీలించి మాకు నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలని మండలంలోని రైతులు కోరారు. మండలంలోని వ్యవసాయ అధికారులుగానీ, ఆర్బీకే అధికారులు గానీ ఇంత వరకూ ఎవరూ వచ్చి పరిశీలించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మండలంలో జామ సాగు చేసిన రైతులకు కూడా గిట్టుబాటు ధర లేక ఎడతెరిపి లేకుండా నిరంతరాయంగా వర్షం పడుతుండడంతో కొనుగోలుదారులు లేక రేటు బాక్స్ 200 రూపాయలు పలకడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రతి రైతు ఈ కోత కూలీలు మరియు మోత కూలీలు కూడా రావడం లేదని పంట పొలాల్లోకి ఆటోలు వెళ్ళక మోత కూలీలు కూడా పెరగడంతో వచ్చిన దిగుబడి కూలీలకే సరిపోతుందని రైతులు వాపోతున్నారు. మండలంలో జామ రైతులు అధికంగా జామ పంట సాగు చేస్తున్నారు. ఇంకా మండలంలో పండ్ల తోటలు అభివృద్ధి చెంది రూపురేఖలు మారాటంలే అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకుంటే మండలంలో పండ్ల తోటలు పెరుగుతాయని, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లిస్తే మండలంలో పండ్ల తోటలు మరింత అభివృద్ధి చెందుతాయని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో వ్యవసాయ అధికారులు పరిశీలించి అరటి మరియు జామ పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## చట్టవ్యతిరేక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపండి..

### పోలీసుల పనితీరు మెరుగుపడాలి : ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



ఓబులవారిపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:

సమాజంలో చట్టవ్యతిరేక కార్యక్రమాలపైన ఉక్కు పాదం మోపి ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. మంగళవారం ఆయన ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, పెండింగ్ కేసులు, వాటి రికార్డులను, ఎర్రచందనం, రౌడీషీటర్లు ప్రమాదాలు సంబంధించిన పలు కేసులను పరిశీలించారు. అన్ని వవిధాలా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మసలుకొని చిరునవ్వుతో వారిని పలకరించి ముందుగా ఏ విషయంపై వచ్చారు.. వారి సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయాలన్నారు. ఓబులవారిపల్లె పోలీసుల పనితీరు మెరుగుపడాలని సూచించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో రాజంపేట డీఎస్పీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సీఐ విశ్వనాథ్‌రెడ్డి, ఓబులవారిపల్లె పోలీసులు ఉన్నారు.

## శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలి

### -డీఈవో రాఘవరెడ్డి



రాయచోటి టౌన్.డిసెంబర్ 13 ప్రభాతవార్త

విద్యార్థులు చిన్ననాటి నుంచే శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని డీఈవో రాఘవరెడ్డి కోరారు. మంగళవారం ఉదయం నేతాజీ సర్కిల్ దగ్గర ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్ట్‌లను పరిశీలించారు. రాయచోటి మండల స్థాయి వైజ్ఞానిక మేళ ఎంతగానో ఆకట్టుకున్నదని ఆయన అన్నారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలు 60 ప్రాజెక్టలను ఇందులో ప్రదర్శించారన్నారు. పిల్లల ప్రదర్శనలు ఎంతో నూతనత్తంతో ఉన్నాయన్నారు. ఇవి సామాజిక సమస్యలను పరిష్కరించేవిధంగా ఉన్నాయన్నారు. ప్రదర్శించిన 60 ప్రాజెక్టల నుంచి 5 ప్రాజెక్టలను జిల్లా స్థాయికి జ్యూరీ మెంబర్లు ఎంపిక చేశారన్నారు. రామాపురం ఉన్నత పాఠశాల రాయచోటి, గరుగుపల్లి ఉన్నతపాఠశాల, కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాల , మాసాపేట ఉన్నత పాఠశాల, రాయచోటి ఏపి మోడల్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, మడితాటి నరసింహారెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘ కన్వీనర్ కొండూరు శ్రీనివాసరాజు, సైన్స్ ఉపాధ్యాయులు తౌఫిక్, బాబా ఫకృద్దీన్, రాజేంద్రప్రసాద్, ఇందిర, పాలెంరాజా, నాగరాజ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లెలో నీటి ప్రవాహం తాకిడికి రాకపోకలు బంద్

### - నీటి ప్రవాహాల వద్ద హెచ్చరిక బోర్డులు



తంబళ్లపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో మాండూస్ తుఫాను కారణంగా పెద్దేరు, చిన్నేరు, దబ్బలగుట్టపల్లి ప్రాజెక్టు పరివాహక వాగులు పొంగి పొర్లడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. తంబళ్లపల్లె నుంచి కొట్టాల ఏటిగడ్డ వద్ద ప్రమాద ఉధృతిని దాటి వాగు ప్రవహిస్తుండడంతో సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా పెద్దేరు ప్రాజెక్టు సమీపంలోని మొరవ వాగు వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఈ 30 గ్రామాల ప్రజలు తంబళ్లపల్లె రావాలంటే పెద్దమండ మండలం అవికేనాయక్ తండా వద్ద నిర్మించిన వంతెన మీదుగా బంద్రేవు రహదారిలో సుమారు 30 కి.మీ తిరిగి రావాల్సి ఉంది. ములకల చెరువు నుంచి తంబళ్లపల్లె రావాలంటే చౌడసముద్రం వద్ద వాగు పొంగడంతో దేవలచెరువు మీదుగా సుమారు 25 కి.మీ అదనంగా తిరిగి రావాల్సిన దుస్థితి. అదే విధంగా కోసువారిపల్లె నుంచి తంబళ్లపల్లెకు 12 కి.మీ అయితే దబ్బలగుట్టపల్లె ప్రాజెక్టు సమీపంలోని సికె.దయ్యాలవారిపల్లి వద్ద గల వంతెన వద్ద నీరు పొంగడంతో వారు ముదివేడు మీదుగా 25 కి.మీ చుట్టి రావాల్సి ఉంది. దీంతో పాటు వేపలపల్లి, చిన్నూరు వాగులు పొంగాయి. దీంతో ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తహసీల్దారు కళావతి మాండూస్ తుఫాను కారణంగా తంబళ్లపల్లె చింతామణి ప్రైవేటు సర్వీసులు, తంబల్లపల్లె-ములకల చెరువు, తంబళ్లపల్లె వయా పెద్దేరు ప్రాజెక్టు ఆర్టీసీ సర్వీసులు రద్దవ్వడంతో తుఫాను ప్రభావంతో ఇరుక్కున్న ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు తుఫాను ప్రభావంలో చిక్కుకున్న ప్రజలకు సౌకర్యాలు, నిత్యావసర సరుకులు, వైద్య సేవలు అందించాల్సి ఉంది.

# గతంలో భూములు పొందినా.. తిరిగి భూముల కోసం ప్రాకులాట

### ఇదెక్కడి న్యాయం అంటున్న గ్రామస్థులు

చిట్వేలి, డిసెంబరు 13 ప్రభాతవార్త

అందరికీ స్థిర నివాసాలు ఏర్పరిచి, ప్రతి ఇంటికి వ్యవసాయ భూములను ప్రభుత్వం పంచిపెట్టినా తిరిగి ప్రభుత్వ భూముల కోసం ప్రాకులాడుతున్న వైనం చిట్వేలి మండల పరిధిలోని రాజుకుంట పంచాయతి అశోక్‌నగర్ కాలనీలో ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉంది. పూర్వపు వివరాలను పరిశీలిస్తే రాపూరు సరిహద్దు నుంచి క్రూర జంతువులతో దట్టమైన అడవిలో సుమారు 10 కిలోమీటర్ల పాటు కాలిబాటన ప్రయాణించే 'కూటాలమర్రి'లో నివాసమున్న సుమారు 30 కుటుంబాలను ప్రభుత్వం అక్కడ నుంచి తరలించి బాధితులందరికి రాజుకుంటకు వెళ్లే రహదారిలో నివాసముండేందుకు కాలనీలు, జీవనాధారంగా వ్యవసాయాన్ని కొనసాగిస్తూ బతికేందుకు రాజగుంట రెవెన్యూ పరిధిలో ఒక ఎకరా, చింతలచెలిక రెవెన్యూ పరిధిలో ఒకటిన్నర ఎకరా మొత్తం కలిపి రెండున్నర ఎకరాల పొలాన్ని అన్ని కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం కేటాయించింది. తమకు సహకరించిన అప్పటి కలెక్టర్ అశోక్‌కుమార్‌కు గుర్తుగా తమ ఊరిని అశోక్‌నగర్ అని ఏర్పాటు చేశారు. కాగా ప్రస్తుతం తమ ఊరికి ఎగువన ఉన్న అటవీ ప్రాంతాన్ని భూముల రూపంలో మాకే కావాలని వామపక్షాలు దరి చేరి ప్రతినిత్యం కార్యాలయాలకు వినతిపత్రాలు అందించడం, ధర్నాలకు దిగడం సదరు కాలనీవాసులకు అలవాటుగా మారింది. అయితే రాజుకుంట పంచాయతి పరిధిలో ఊరు పుట్టినప్పటి నుంచి 120 సంవత్సరాలుగా గ్రామాన్ని నమ్ముకుని అన్ని వర్గాల్లో ముఖ్యంగా బలహీనవర్గాలైన ఎస్‌టిల్లో అనేకమంది పేద ప్రజలు కనీసం సెంటు భూమి లేనప్పటికీ గతంలో భూములు పొంది అనుభవిస్తున్న అశోక్‌నగర్‌వాసులు తిరిగి భూములు కావాలనడం, వారికి మంగళవారం సిపిఐ వామపక్షం మద్దతు పలకడం ఇక్కడ ఆశాస్పదంగా మారింది. భూమిలేని పేదల పక్షాన నిలిచి ప్రశ్నించాల్సిన సిపిఐ గతంలో భూములు పొందిన వారి పక్షాన నిలబడడం ఎంతవరకు సబబు అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. కాగా రెవెన్యూ అధికారులు ఇక్కడ పూర్వ, ప్రస్తుత పరిస్థితులు నిశితంగా పరిశీలించి రాజగుంట పంచాయతిలోని భూమిలేని నిరుపేదలకు న్యాయం చేయాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# రాష్ట్రంలో త్వరలో అత్యయిక పరిస్థితి

## డిసిసి మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్

కడప ఏడురోడ్లు, డిసెంబర్ 13 ప్రభాతవార్త :



మన రాష్ట్రంలో త్వరలో ఆర్థిక అత్యయిక పరిస్థితి రాబో తున్నదని డిసిసి మాజీ అధ్యకులు షేక్ నజీర్ అహ్మద్ అన్నారు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. విశ్రాంత ఉద్యోగులకు పెంచను రావట్లేదని, పదవి విరమణ ప్రయోజనాల ఊసే లేదు. 13వ తేదీ దాటిన కొందరు ఉద్యోగులకు జీతాలు పడలేదు. పనులు చేసిన బిల్లుల కు బకాయిలు చెల్లించి తమ ప్రాణాలు కాపాడాలంటూ గుత్తేదారులు భిక్షాటన చేస్తున్నారన్నారు. రహదారుల గుంతలు పూడ్చుటకు నిధులు లేవు. గత సంవత్సరం వర్షాకాలంలో పాడైపోయిన కొట్టుకుపోయిన నీటి ప్రాజెక్టుల మరమ్మత్తులు లేవు, ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం. ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తున్నారు ఓడి గీత దాటి పోతుందని రిజర్వ్ బ్యాంకు హెచ్చరికలు జారీచేసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రం ఏమైపోతుందోనని భయమేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జోడు నాగరాజు,అరీఫుల్లా, విజయభాస్కర్, గౌస్ మోహిద్దీన్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక వ్యాధులకు 104 ద్వారా వైద్య సేవలు

బ్రహ్మంగారి మఠం, డిసెంబరు 13 ప్రభాతవార్త :



104 వాహనం ద్వారా వైద్య సేవలందిస్తున్న డా॥ ఝాన్సి

గ్రామీణ ప్రాంతాలలో దీర్ఘకాలిక వ్యా ధులతో బాధపడుతున్న వృద్ధుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో 104 వాహనం నందు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో చేపడుతున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పలుగురాళ్ళపల్లె ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డా॥ ఝాన్సి తెలిపారు. మంగళవారం మండలంలోని చౌదరివారిపల్లె మండల ప్రాథమిక పాఠశాల ఆవరణంలో 104 వాహనం ద్వారా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నెలకు ఒక సారి రాష్ట్ర ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పిస్తుందని, వచ్చే నెల నుండి నెలకు రెండు దఫాలు 104 ద్వారా పంచాయతీలోని రెండు గ్రామా లలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌వో పీరయ్య, ఎంఎల్‌హెచ్‌పి సృజన, ఏఎన్‌ఎంలు వెంకటరెడ్డి, వినిత కుమారి, 104 సిబ్బంది రామమోహన్, ప్రాథమిక వైద్యశాల సిబ్బంది క్రిష్టఫర్, ఆశా కార్యకర్తలు లక్కినేని స్వప్న,

# రామక్రిష్ణ మృతదేహానికి నివాళులర్పించిన మాజీ టిటిడి సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు

చిన్నమండెం.డిసెంబర్ 13 ప్రభాతవార్త



మండలంలోని దేవగుడిపల్లి గ్రామ కస్పాలో టీడీపి కార్యకర్త తిరుపతి రామక్రిష్ణ అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసి మాజీ టీటీడి పాలకమండలి సభ్యులు రాయచోటి తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు విచ్చేసి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో దేవగుడిపల్లి మాజీ సర్పంచ్ మల్లిఖార్జున, లాయర్ సతీస్‌రెడ్డి, మండల తెలుగుయువత అధ్యక్షుడు తౌహిద్‌ఖాన్, రామచంద్ర, రంగా, అంజీ, లక్ష్మయ్య, శివయ్య, మహేష్, బాబు, సూరి, గని, తేజ తదితరులు పరామర్శించారు.

# తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు లాప్టాప్స్ పంపిణీ

రామాపురం.డిసెంబర్ 13 ప్రభాతవార్త



తెలుగు అసోషియేషన్ ఉత్తర అమెరికా తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ పురుషోత్తం చౌదరి గుడె ల్యాబ్ ట్యాబ్‌ను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు తమ ఫౌండేషన్ ద్వారా చేయూత ఇవ్వడంలో భాగంగా ల్యాబ్ ట్యాబ్‌ను ఉపకార వేతనాలు ప్రతి సంవత్సరం పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా రామాపురం మండలం కల్పనాయుని చెరువు పంచాయతీలోని ఆగ్రహారంకు చెందిన జడ అమృత లక్ష్మీ, కడప అన్నమాచార్య ఇంజనీరింగ్ కాలేజీలో, సిఎస్‌సి మొదటి సంవత్సరం చదువుతుండగా ఆమెకు ల్యాబ్‌ట్యాబ్‌ను పంపిణీ చేశారు. తను చదువు గాను ల్యాబ్‌ట్యాబ్‌ను అందించిన తానా ఫౌండేషన్ ట్రస్ట్ వారికి విద్యార్థికి జడ అమృత లక్ష్మీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘు ఎరికిలపాటి తానా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సంక్షేమాభివృద్ధిలో సీఎం సరికొత్త అడుగులు

రామాపురం.డిసెంబర్ 13 ప్రభాతవార్త



సంక్షేమాభివృద్ధిలో సిఎం జగన్ సరికొత్త అడుగులు వేశారని వైఎస్ఆర్‌సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రామాపురం మండలం సరస్వతిపల్లి గ్రామంలోని ఉడుంవారిపల్లి, నాయినివారిపల్లిలలో శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, సమస్యలపై ఆరాతీస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సదర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో జగన్ ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేయడంతో ప్రతి ఇంటా సంక్షేమ బావుటా ఎగురుతోందన్నారు. ఉడుంవారిపల్లిలోని ప్రాథమిక పాఠశాలను శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు.

# రైల్వేకోడూరు పోలీసుల పనితీరుపై ఎస్పీ ప్రశంసలు

### రోడ్డు ప్రమాదాల అవగాహనలో ప్రజలు అప్రమత్తత అవసరం : ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రైల్వేకోడూరు, డిసెంబరు 13 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్న వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నమయ్య జిల్లా ఎస్పి వి.హర్షవర్ధన్‌రాజు అన్నారు. మంగళవారం ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు కోడూరు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని అటవీ సమీప ప్రాంతాలైన 40 గ్రామాలను గుర్తించామని, ముఖ్యంగా ఇటీవల 150 మందికి పైగా ఎర్రచందనం ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశామని అన్నారు. ఎవరైనా ఈజీ మనీ కోసం ప్రయత్నాలు చేసి ఎర్రచందనం జోలికి వెళితే అటవీశాఖ ఆంక్షల మేరకు కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదాల పట్ల అన్నమయ్య జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాహనం నడిపేటప్పుడు హెల్మెంట్, సీటు బెల్టు తదితర ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని అన్నారు. బైపాస్ రోడ్డులేని కారణంగా వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడిపి వారి కుటుంబాలకు అండగా నివాలన్నదే పోలీసుల ఆకాంక్ష అని హర్షవర్ధన్‌రాజు అన్నారు.

రైల్వేకోడూరు పోలీసుల పనితీరుపై ఎస్‌పి ప్రశంసలు

రైల్వేకోడూరు మండలంలోని స్థానిక పోలీసుల పనితీరుపై ఎస్పి హర్షవర్ధన్‌రాజు ప్రశంసించారు. ముఖ్యంగా పోలీసుల పనితీరు పట్ల, పాత కేసుల నేరస్తుల పట్ల పోలీసుల పనితీరుపై ఆయన ప్రశంసల జల్లు కురిపిచారు. దిశ, స్పందన, 100 కాల్స్‌పై రైల్వేకోడూరు నియోజకవర్గంలో బాధితుల పట్ల సిఐ విశ్వనాథ్‌రెడ్డి ఉన్నఫళంగా స్పందించడం బాధితులకు అండగా నిలవడం ఎంతో అభినందించాల్సిన విషయం ఉందని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని సిఐ విశ్వనాథ్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట డిఎస్‌పి శివభాస్కర్‌రెడ్డి, సిఐ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్‌ఐలు మోహన్‌కుమార్‌గౌడ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ

రాయచోటి.డిసెంబర్ 13 ప్రభాతవార్త

రాయచోటి పట్టణం బస్టాండు ప్లాట్‌ఫారంపై దేవాలయాల దగ్గర చలికి వణుకుతూ నిద్రిస్తున్న నిరుపేదలకు మంగళవారం రాత్రి లయన్స్ క్లబ్ మాజీ జోన్ చైర్మన్ అశోక్‌రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఇంటరే్నషనల్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ మాట్లాడుతూ 1916లో చికాగో లో స్థాపించి ప్రపంచంలోని రెండు వందల దేశాలుకు లయన్స్ క్లబ్ విస్తరించడం జరిగిందన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు నిస్వార్థంగా దాతల సేకరించి వారి నుంచి పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించడం తమ కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, జోన్ కో ఆర్డినేటర్ జాన్‌బాషా, కార్యదర్శి ఇందాక్ అహ్మద్, సభ్యులు వెంకటచలపతి, అఖిల్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డు గుర్రయ్య సేవలను అభినందించిన ఎస్పీ

బద్వేలు అర్బన్, డిసెంబరు 13 ప్రభాతవార్త



బద్వేలు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న గుర్రయ్య సేవలను గుర్తించి మంగళవారం కడప నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ కార్యాలయంలో ఎస్పీ అన్బురాజన్ చేతుల మీదుగా హోంగార్డు గుర్రయ్యకు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. బద్వేలు పట్టణంలో గత కరోనా మహమ్మారి సమయం నుండి నిరంతరాయంగా ట్రాఫిక్ నియంత్రణలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు పోలీసు సేవలు అందిస్తున్న హోంగార్డు గుర్రయ్య సేవలను అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేశారు. అనంతరం ప్రశంసా పత్రం అందుకున్న హోంగార్డు గుర్రయ్య మాట్లాడుతూ ట్రాఫిక్ లో విధులు నిర్వహిస్తూ ట్రాఫిక్ వాహనదారులకు, ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహిస్తున్న తమ విధులను గుర్తించి ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# అన్ని వర్గాలకు వైసిపి ప్రభుత్వం చేసింది శూన్యం

రామాపురం.డిసెంబర్ 13 ప్రభాతవార్త



వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ఒరిగిందేమి లేదని సంక్షేమ శూన్యమని టీడిపి మైనార్టీ మండల నాయకుడు ఎస్.మహబూబ్‌బాష అన్నారు. రాయచోటి నియోజవకర్గ టీడిపి ఇంచార్జ్ రమేష్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని నీలకంఠరావుపేటలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలన గురించి ప్రజలకు ఆయన వివరించారు. ప్రభుత్వ పథకాలతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. టీడిపి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు అవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడిపి నాయకులు గ్రామ కమిటి అధ్యక్షులు మహబూబ్‌బాష, నియాజ్, బాషవలి, షఫీవుల్లా, సిరాజ్, మహమ్మద్‌గౌస్, మునాఫ్ పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్న సీఎం జగన్

సంబేపల్లి.డిసెంబర్ 13 ప్రభాతవార్త



సంక్షేమ పథకాల పేరుతో మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు నడ్డి విరుస్తున్నారని సంబేపల్లి మండల టీడిపి మండల అధ్యక్షులు చిన్న రెడ్డెయ్య యాదవ్ అన్నారు. మంగళవారం రాయచోటి నియోజకవర్గపు టీడిపి ఇన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని గున్నికుంట్ల గ్రామంలో మన రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి జగన్ ప్రభుత్వం అవలంభిస్తున్నటువంటి వైఖరిని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ సిద్దారెడ్డి, అరుణమ్మ, ఆవుల సుబ్బయ్య, వెంకట్రామిరెడ్డి, రామరాజు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతు భరోసా కేంద్రం ఆకస్మిక తనిఖీ

## - సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు

బద్వేలు రూరల్, డిసెంబరు 13 ప్రభాతవార్త :



మండల పరిధిలోని చింతలచెరువు గ్రామ పంచాయతీ అబ్బుసాహెబ్‌పేట గ్రామంలో నారిబోయిన విజయశేఖర్ పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన వరి పంటను పరిశీలించడం జరిగిందని సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 3 రోజుల నుండి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పంటలు సాగుచేసిన రైతులు పంట పొలాలు ఏ విధంగా ఉన్నాయని పరిశీలించడం జరిగిందని, అంతే కాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన వరి పంటను జిగురు పూసిన పసుపు తెలుపు పల్లాలు, లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు ఏర్పాటుచేయడం, దోమపోటు నివారణకు కాలిబాటలు తీయడం, ద్రవ జీవామృతం రెండు సార్లు పారించడం జరిగిందని, గట్ల మీద చెండు మల్లిని సాగు చేసే విధానంపై రాజీలేని సూత్రాల అమలు వల్ల పెట్టుబడి వ్యవసాయం గణనీయంగా తగ్గించవచ్చని పలు రకాల సూచనలు, సలహాలు రైతులకు తెలియజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు పలువురు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మంచి చేస్తారన్న నమ్మకం పోయింది

## -పార్టీ ప్రతిష్ట దిగజారిపోతోంది -వైకాపా మండల కన్వీనర్ ఆనందరెడ్డి

టి.సుండుపల్లి.డిసెంబర్ 13 ప్రభాతవార్త



రాజంపేట ఎమ్మెల్యే మంచి చేస్తారన్న నమ్మకం పోయింది. గత మూడు సంవత్సరాల నుంచి రెండు పల్లెలో అరాచకాలు పెరిగిపోయాయని వైఎస్సార్‌సిపి సుండుపల్లి మండల కన్వీనర్ యర్రపురెడ్డి ఆనందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుండుపల్లి మండల కేంద్రానికి సమీపంలోని గొర్రెలదిన్నెపల్లి హరిజనవాడకు చెందిన దళిత మహిళ రైతు లక్ష్మీదేవికి సంబందించిన వ్యవసాయ భూమిని తమ అవసరాలకు కావాలంటే అడిగి తీసుకోవాలని కానీ ఇవ్వకపోతే కక్ష పెట్టుకుని చెట్లు నరికివేయడం దారుణమన్నారు. చెట్లు నరకేశారు అన్న విషయాన్ని జీర్ణించుకోలేక అన్నమయ్య జిల్లా ఎస్పీ, ఎస్సీ కమీషనర్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఆయన అన్నారు. దళిత మహిళను ఓదార్చాల్సిన ఎమ్మెల్యే సుండుపల్లి మండలానికి వచ్చి కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సిపి కోసం పని చేసిన కార్యకర్తలు, నాయకులు అభిమానులు అందరూ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాదపడాల్సిన పరిస్థితి ఎదురవుతోందన్నారు. ఎమ్మెల్యే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తారని భావించాము అలా జరగడం లేదని అన్నారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్న పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ముద్దాయిలు ఎవరైనా సరే పోలీస్‌లు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# నేడు అభివద్ధి కార్యక్రమాలపై సమీక్ష

కె.వి.పల్లె, డిసెంబరు 13 ప్రభాతవార్తః

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం 11గంటలకు అభివద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించబడునని ఎంపీడీఓ మహమ్మద్ ఖదీర్ తెలిపారు. ఈసమావేశానికి మండల స్థాయి అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు. మండలంలోని వివిధ అభివద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేయడానికి అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

# ఇంజినీరింగ్ విద్యార్థులకు చేయూత

కడప కార్పొరేషన్, డిసెంబరు 13, ప్రభాతవార్త:



రామనపల్లె గ్రామ నివాసి అంబటి శివ శంకరయ్య గుండెపోటుతో మరణించారని తొగట వీరక్షత్రియ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బండారు రగు రామయ్య, కడప జిల్లా అధ్యక్షులు బండారు సూర్య నారాయణ, నగర అధ్యక్షులు కల్యా సుధాకర్, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ చదువుతున్నా ఆయన కుమారులు ఫీజులు కట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యా నిమిత్తం రూ.1.16 లక్షలు వితరణ అందించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షులు సీఆర్ఐ సునీల్ జయంత్, తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి సుంకర రామ చంద్రుడు, కోశాధికారి టేకూరి సుదర్శన్, ఉమ్మడిశెట్టి సుబ్రమణ్యం, కమలాపు రం తొగట క్షత్రియ యువజన సంఘం అధ్యక్షులు వేల్పుల సుబ్రమణ్యం, చెన్నూరు మండల అధ్యక్షులు మడక వెంకటసుబ్బయ్య, కమలాపురం నియోజకవర్గం అధ్యక్షులు కంచన శివప్రసాద్, వెంకటరమణ, పట్టుపోగుల పవన్ పాల్గొన్నారు.

# కరెంటు షాక్ తగిలి వ్యక్తికి గాయాలు

ములకల చెరువు, డిసెంబరు 13, ప్రభాతవార్త:



కరెంట్ షాక్ తగిలి వ్యక్తికి గాయాలైన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దేవల్ చెరువు పంచాయతీ మామిళ్లవారిపల్లెకు చెందిన సుబ్బన్న (60) పెద్దపాలెంలోని మద్యం దుకాణం వద్దకు మద్యం కోసం వచ్చాడు. వర్షం కురవడంతో మద్యం దుకాణానికి ముందు ఏర్పాటు చేసిన ఇనుప రాడ్‌ను పట్టుకోవడంతో సుబ్బన్నకు షార్ట్ సర్క్యూట్ అయ్యి గాయాలయ్యాయి. 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

# ఎస్ఈబిడి పోలీసు సర్కిల్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

వాల్మీకిపురం, డిసెంబరు 13 ప్రభాతవార్తః



వాల్మీకిపురం ఎస్ఈబీఓ సర్కిల్ పరిధిలో నేరాలు అదుపునకు ఎస్ఈబీ సిబ్బంద సమర్థవంతంగా పని చేయాలని అన్నమయ్య జిల్లా అడిషినల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎస్ఈబీ పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలిం చారు. తదుపరి సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. అనంతరం ఎస్ఈబీ పోలీసు సిబ్బందిని ఉద్దశించి మాట్లాడుతూ అక్రమ అమ్మకందారులపై కఠినంగా వ్యవహ రించడంతో పాటు పీడీ కేసులు నమోదుచేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని పాత ముద్దాయిలను పిలిపించి తరచూ వారికి కౌన్సి లింగ్ ఇవ్వాలని సూచించారు. పాత ముద్దాయిలు మంచిగా మారినట్లు గురిస్తే వారికి ప్రభుత్వ సంక్షేమం అందేవిధంగా పలు సూచనలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సీఐ శివసాగర్, ఎస్ఈబీ పోలీసులు పాల్గొన్నారు.

# జలకళ సంతరించుకున్న చెరువులు

వాల్మీకిపురం, డిసెంబరు 13 ప్రభాతవార్తః



మండలంలో చెప్పుకోదగ్గ చెరువులైన భోగంపల్లె మినీ రిజర్వాయర్, విఠలం పెద్ద చెరువులు నిండిపోయాయి. మొరవలు ప్రారంభమైయ్యాయి. భోగంపల్లె ప్రాజెక్టు నిండిపోవడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక రెండేళ్లపాటు తాగునీటి కష్టాలు ఏమాత్రం ఉండబోవని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పట్టణ తూర్పు పొలమేరలో ఉన్న విఠళం పెద్ద చెరువు సైతం బహుదానది నీటి ప్రవాహంతో మంగళవారం దాదాపుగా నిండిపోయింది. మొరవ 24 గంటలు ఈచెరువు సైతం ప్రారంభం కానుంది. దీంతొ వ్యవసాయా నికి కూడా సాగునీటి కష్టాలు ఉండవని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండోస్ తుఫాన్ రైతులకు, ప్రజలకు భవిష్యత్తులో రెండేళ్ల పాటు తాగు, సాగునీటి కష్టాలు తీరేవిధంగా చేసిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పార్టీలకతీతంగా పథకాలు అందించాలి : ఎమ్మెల్యే

పీలేరు, డిసెంబరు 13 ప్రభాతవార్తః



రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా పలు అభివద్ధి సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కోటపల్లె మాజీ ఎమ్మెల్యే జీవి. శ్రీనాథరెడ్డి స్వగహంలో పీలేరు, కేవి.పల్లె మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవి.శ్రీనాథరెడ్డి పార్టీలోకి రావడంశుభ పరిణామమని అందరూ కలిసి కట్టుగా సమిష్టిగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదని ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్క రించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు పా త్ర కీలకం అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్యం కార్మికు లకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవి.శ్రీనాథరెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకు సహదేవరెడ్డి, జడ్పీటీసీ ఏటీ.రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచి హబీబ్‌బషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, జడ్పీ కోఆ ప్షన్ షఫీ, డీసీసీబీ డైరెక్టర్ స్టాంపుల మస్తాన్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# గృహనిర్మాణ సంఘ అధ్యక్ష కార్యదర్శులకు సన్మానం

రాయచోటి టౌన్.డిసెంబర్ 13 ప్రభాతవార్త



రాయచోటి పట్టణంలోని రాయచోటి తాలూకా సహకార గృహ నిర్మాణ సంఘ అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన ఎమ్.మధుసూధన్‌రెడ్డి, ఆర్.జయచంద్ర మరియు డైరెక్టర్లుగా ఎన్నికైన పి.రాజ, సిద్దయ్యనాయుడు లకు ఏపిజిఈఏ జిల్లా అధ్యక్షులు యర్రపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ఏపిజిఇఏ జిల్లా కార్యాలయం నందు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్, జిల్లా కోశాధికారి యం.సుధాకర్‌రాజు, ఉపాధ్యక్షులు యం.రెడ్డినాయక్, రాయచోటి తాలూకా అధ్యక్ష కార్యదర్శులు ఓ.సాయికుమార్, డి.సుజిత్, తాలూకా కార్యవర్గ సభ్యులు కె.సదాశివరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కల్తీ మాంసం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు, డిసెంబరు 13, ప్రభాతవార్త:



కల్తీ మాంసం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సమతా సైనిక్ దళ్ జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షులు గద్దం ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన జమ్మలమడుగు మండల పరిషత్ అభివృద్ధి అధికారికి వినతిపత్రం అందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులైన బిర్రు (పాపోడు), చంద్రకుమార్, గండికోట బాషా, మాధవాపురం ఓబులేసు, దేశిరెడ్డి గురివిరెడ్డి, రెడ్డితోట యోహాన్, నాయీ బ్రాహ్మణ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు పాలకేంద్రం అభివృద్ధి చేయాలి : సిపిఐ

ప్రొద్దుటూరు డిసెంబర్ 13, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సొంత జిల్లాను గుర్తించాలని ప్రొద్దుటూరు పాలకేంద్రం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని లేదంటే ఉద్యమిస్తామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి రామయ్య పట్టణ కార్యదర్శి పి సుబ్బరాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో చిత్తూరులో మూతపడ్డ పాలకేంద్రం తిరిగి ప్రారంభించడానికి మంత్రివర్గ ఆమోదం పొందిందని, జగన్ సొంత కడప జిల్లాలోని ప్రొద్దుటూరు పాలకేంద్రం తిరిగి ప్రారంభమైతే నంద్యాల వరకు పాల సేకరణ ఉత్పత్తి పెరిగి పాడి అభివృద్ధి చెందుతుందన్నారు పాలకేంద్రం మూసివేతకు నిరసనగా ఆమరణ దీక్షలు సైతం జరిగాయని వారు గుర్తు చేశారు ఎన్నికలకు ముందు వైసిపి ప్రొద్దుటూరు పాలకేంద్రం ఓట్లను ఆయుధంగా ఉపయోగించుకొని మోసం చేస్తుందన్నారు ఇప్పటికైనా ప్రొద్దుటూరు పాలకేంద్రం పై తిరిగి ఆలోచించకపోతే జగన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆ మేరకు సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

# రాష్ట్రష కార్యదర్శిగా రాజశేఖర్ ఏకగ్రీవం

పెండ్లిమర్రి, డిసెంబరు 13, ప్రభాతవార్త:



ఏపీ జూనియర్ మరియు వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం విజయవాడ నందు జరిగింది. ఇందులో భాగంగా నంద్యాల రాజశేఖర్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సంఘానికి కట్టుబడి సంఘం కోసం కష్టపడి పని చేసి సంఘ సభ్యుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలపారు. జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన వెంటనే గతంలో చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర సంఘం నన్ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

# పంచాయతీ అభివృద్ధి ప్లాన్-2022-23పై శిక్షణ

పెండ్లిమర్రి, డిసెంబరు 13, ప్రభాతవార్త:



గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ 2022-23 శిక్షణ కార్యక్రమం మంగళవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సంద ర్భంగా ఎంపీడీవో అల్తాఫ్ మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఇందులో మెడిటేషన్ సందర్భంగా పావని మెడిటేషన్ గురించి చెప్పడం జరిగింది.

# ఎర్రచందనం అక్రమంగా విక్రయిస్తే చర్యలు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:



ఎర్రచందనం అక్రమంగా విక్రయించినా, సహాయం చేసినా, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చౌటపల్లె గ్రామంలో ఎర్రచందనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొంత మంది ఎర్రచందనం అక్రమంగా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఎవరైనా ఎర్రచందనం విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. మానవ జీవన విధానంలో నడవాలని అక్రమాలు అన్యాయాలకు పాల్పడవద్దని ఆయన ప్రజలకు హితవు పలికారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్, పోలీసు సబ్బంది, స్పెషల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం మాకు రెండు కళ్లు

ఎర్రగుంట్ల, డిసెంబర్ 13, ప్రభాతవార్త



ఎర్రగుంట్ల పరిధిలోని 8వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్ రెడ్డి నిర్వహించారు.8వ వార్డులోని ప్రతి ఇంటికి తిరుగుతూ సమస్యలను అక్కడికక్కడే అధికారుల సమ క్షంలో పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికి అందడమే తమ ప్రభుత్వ ధ్యేయమని, పార్టీలకు అతీ తంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని, జనవరి 1వ తేదీ నుండి పెన్షన్ 2500 నుండి 2750కు పెంచడం జరిగిందని, మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెర వేర్చామని ప్రజలు తిరిగి మమ్మల్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో పాటు ఎర్రగుంట్ల వైయస్సార్సీపి మండల ఇన్చార్జి సురేంద్రనాథ్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పగిడాల జగన్నాథ్ ఆర్ఐ సాంబశివారెడ్డి, సచివాలయసిబ్బంది వైయస్సార్సీపి నాయకులు గంగా కృష్ణారెడ్డి, డి. వెంకట శివారెడ్డి, నాగార్జున రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్లూరులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రొద్దుటూరు డిసెంబర్ 13, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి గ్రామ సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి ఉపసర్పంచ్ నరేంద్ర రెడ్డి ఆధ్వర్యం లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచ మల్లు శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల చేకూరున లబ్దిని అడిగి తెలుసుకున్నారు గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిం చారు కార్యక్రమంలో మండల అధ్యక్షులు సానబోయిన శేఖర్ యాదవ్ మండల ఉపాధ్యక్షులు ఇంజేటి రెడ్డమ్మ వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి వైసీపీ సీనియర్ నాయకులు నాగ శేషారెడ్డి కౌన్సిలర్లు ఇర్ఫాన్ భాష కమాల్ భాష స్థానిక గ్రామ నాయకులు పుల్లారెడ్డి నాగ సుబ్బారెడ్డి భరత్ రెడ్డి సుబ్రహ్మణ్యం యాదవ్ శేషారెడ్డి రాజశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కేవి.పల్లె తహశీల్దారుగా ప్రేమ్‌నాథ్‌కుమార్

కేవి.పల్లె, డిసెంబరు 13 ప్రభాతవార్తః



మండల తహశీల్దారుగా ప్రేమ్‌నాథ్ కుమార్ మంగళవారం పదవీబ్యాధతలు చేపట్టారు. ఆయన కడప నుంచి బదిలీపై కేవి.పల్లెకు విచ్చేశారు. ఇక్కడ తహశీ ల్దారుగా పనిచేస్తున్న మహ్మద్ అజారుద్దీన్ బదిలీపై రాయచోటికి వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దారు ప్రేమ్‌నాథ్‌కుమార్ రెవెన్యూ సిబ్బందితో సమావేశమై మండలంలోని భూముల రీసర్వే గురించి ఎమ్మెల్సీ ఎన్నికలు గురించి చర్చించారు. కార్య క్రమంలో వీఆర్ఏలు రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

జమ్మలమడుగు, డిసెంబరు 13, ప్రభాతవార్త:

జమ్మలమడుగు పీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధిం చారు. పర్యావరణ హిత నమూనాలో కరుణసాగర్ రెడ్డి, ఆరోగ్య పరిశుభ్రత అంశంపై జడ్పీహెచ్ఎస్ (బాలికల) లక్ష్మీచంద్రిక, సాఫ్ట్ వేర్ ఆప్స్ అంశంపై మమత, పర్యావరణ, వాతావరణ మార్పులపై రాజ రాజే శ్వరిదేవిలు బహుమతులు సాధించారు.

## తుఫాన్ దెబ్బకు వేల ఎకరాల్లో వరిపంట నష్టం

మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త:



మాండూస్ తుఫాన్ వర్షం దెబ్బకు మదనపల్లె డివిజన్‌లో సుమారు ఆరువేల ఎకరాలకు పైగా వరిపంట నష్టం వాటిల్లి నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. పంటనష్టం కూడా సుమారు రూ.5కోట్లకు పైనే ఉంటుందని అంచనాలు వేస్తున్నారు. 1000మంది రైతులకు పైగా పంట నష్టంపోయినట్లు అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. నష్ట పోయిన రైతులకు పరిహారం అందించేందుకు వ్యవసాయ అధికారులు ఉన్న తాధికారులకు నివేదికలు పంపుతున్నారు. వరిపంటతో పాటు రాగి, మొక్కజొన్న, టమోటా, కొత్తిమీర, కూరగాయల పంటలన్నీ దెబ్బతిన్నాయి. వీటి పరిహారానికి కూడా ఆర్‌బికే రైతు భరోసా కేంద్రాల ద్వారా సచివాలయ వ్యవసాయ అధికా రులు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. మూడు రోజులు పాటు నిరవధికంగా పడిన మాండూస్ తుఫాన్ వర్షానికి వివిధ రకాల పంటలతో పాటు రోడ్లు, చెరువు కట్టలు, కాలువలు దెబ్బతిన్నాయి. వీటి మరమ్మత్తులకు కూడా ఆయా శాఖల అధి కారులు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో చెరువులన్నీ నిండుకుండలా ఉన్నాయి. మళ్ళీ వర్షం పడితే చెరువులు ప్రమాదపు అంచున ఉండే సూచనలు ఉన్నాయని ఇరిగేషన్ అదికారులు చెబుతున్నారు. వర్షంతో దెబ్బతిన్న రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

## పట్టుపరిశ్రమపై అవగాహన ఉండాలి

### జిల్లా సిరికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డి

మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త:



సిల్క్ రీలర్లకు, సిల్క్ ట్విస్టర్స్‌కు పట్టుపరిశ్రమపై అవగాహన ఉండాలని జిల్లా సిరికల్చర్ అధికారి పి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టుగూళ్ళ మార్కెట్ యార్డులో పట్టు పరిశ్రమ వ్యవ స్థాపకుల నమోదు కార్యక్రమం సందర్భంగా రిలర్లకు అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈసందర్భంగా జిల్లా సిరికల్చర్ అధికారి మాట్లాడుతూ ఎంఎస్ ఎంఈలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమంలో అవగాహన పొందాలన్నారు. వ్యవ స్థాపకుల నమోదు చేసుకొన్న వారికి ప్రభుత్వం సర్టిఫికెట్లు మంజూరు చేస్తాం దన్నారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా రీలర్లు, ట్విస్టర్లు ముద్రా రుణాలు, వివిధ ప్రభుత్వ రుణలను పొందవచ్చునన్నారు. ప్రభుత్వ గుర్తింపుతో సర్టిఫికెట్లు ఉన్న రీలర్లు పట్టుపరిశ్రమశాఖలో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు, పరిశ్రమల అభివృద్ది అధికారి శంకర్, మార్కెట్ ఏడిఏ రామ్మోహన్, రీలర్లు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులు ఆర్‌బికేలో ఫిర్యాదు చేయండి

### మండల వ్యవసాయ అధికారి డాక్టర్ నాగప్రసాద్

మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త:



మాండూస్ తుఫాన్ ప్రభావం వల్ల పంటలు నష్టపోయిన రైతులు సంబంధిత రైతుబరోసా కేంద్రాల్లో ఫిర్యాదు చేస్తే పరిహారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి డాక్టర్ జిఎన్.నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె రూరల్ మండల పరిధిలో 867 హెక్టార్లలో వరిపంట సాగు కాగా, 340 ఎకరాలు ప్రాథమికంగా నష్టపోయిందన్నారు. సుమారు రూ.కోటి వరకు రైతులు తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయినట్లు తెలిసిందన్నారు. 407మంది రైతులు వివిధ రకాల పంటల సాగులో దెబ్బతిన్నారన్నారు. 434 ఎకరాల్లో టమోటా, కూరగాయలు, జొన్న, కొత్తిమీర పంటలు కూడా నష్టపోవడం జరిగిం దన్నారు. వీటి పరిహారానికి నివేధికలు సిద్దం చేసి ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. ఏడిఏ శివశంకర్ ఆధ్వర్యంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించడం జరిగిందన్నారు.

## టిడిపి బిసి సాదికార కమిటి కోఆర్డినేటర్‌గా సిద్దప్ప

మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ బిసి సాధికార కమిటీ కోఆర్డి నేటర్‌గా మోడెం సిద్దప్పను నియమించారు. మంగళ వారం రాష్ట్ర అధ్యక్షులు అచ్చెంనాయుడు, బిసి విభాగం రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర బిసి సాధికారిక కమిటీని నియమించారు. పార్లమెంటు జిల్లాను ఓ యూనిట్‌గా చేసుకొని సాధికార కమిటి లో కోఆర్డినేటర్‌ను నియమించారు. రాజంపేట పార్లమెంటు పరిధిలో మదనపల్లె లోని నీరుగట్టువారి పల్లెకు చెందిన బిసి నాయకులు మోడెం సిద్దప్పను కమిటీలో కోఆర్డినేటర్‌గా నియమించారు. గతంలో సిద్దప్ప పట్టణ అధ్యక్షులుగా, బిసి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పని చేశారు.

## కనకదాస్ 535వ జయంతికి రండి

### కర్నాటక మాజీ మంత్రికి విన్నపం

మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త:



కురబల ఆరాధ్యదైవమైన కనకదాస్ 535వ జయం తికి రండి అంటూ కర్నాటక మాజీ మంత్రి, ఎమ్మెల్సీ హెచ్.విశ్వనాథ్‌ను రాష్ట్ర కురబసంఘం అధ్యక్షులు జబ్బుల శ్రీనివాసులు ఆహ్వానించారు. ఈనెల 27న జరగబోయే కనకదాస్ జయం తి ఉత్సవాలు, షెఫర్డ్ ఇండియా ఇంటర్‌నేషనల్, రాష్ట్ర కురబ సంఘం 7వ వార్షికోత్సవ ఉత్సవాలకు ముఖ్యఅతిధిగా రావాలని విన్నవించారు. అనంతరం కురబ సంఘం నాయకులకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

## లోకేష్‌ను కలిసిన జయరామ్‌నాయుడు

మదనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మంగళవారం హైదరాబాద్‌లో మదనపల్లె నియోజక వర్గ టిడిపి నాయకులు శ్రీరామనేని జయ రామ్ నాయుడు కలిశారు. ఈ సందర్భం గా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గురించి లోకేష్ అడిగి తెలుసుకొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి 2024 ఎన్నికల్లో మదనపల్లెలో టిడిపి జెండా ఎగుర వేసేందుకు కృషి చేయాలని లోకేష్ సూచించినట్లు తెలిపారు.

## కర్నాటక మద్యం అమ్మకందారునిపై కేసు నమోదు

రామసముద్రం, డిసెంబర్ 13 ప్రభాతవార్త:

కర్నాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలోని దిగువ హరి జన వాడకు చెందిన రాజన్న కుమారుడు ప్రశాంత్ మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం పోలీసులకు తెలియడంతో పోలీసులు వెంటనే ప్రశాంత్ విక్రయిస్తున్న స్థలంకు చేరుకొగా అతను మద్యం బాటిళ్లను వదలి పరారయ్యాడు. ఆ బాటిళ్ళ సంచిని స్వాధీనంచేసుకొని ప్రశాంత్‌పైకేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## మైనార్టీల సంక్షేమంపై సిఎం ప్రత్యేక దృష్టి

కలికిరి, డిసెంబర్ 13 ప్రభాతవార్త:

రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమంపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు రాష్ట్రమైనార్టీ కార్పొరేషన్ ఛైర్మెర్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ అన్నారు. మంగళవారం కలికిరి-మదనపల్లె రోడ్డు మార్గంలోని సర్వేనెంబర్ 585లోని స్థలాన్ని పరిశీలించారు. జేఎన్‌టియు కళాశాల సమీపంలో ఈద్గా మసీదు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈద్గా మసీదునిర్మాణానికి ఎకరా స్థలం కావాల్సి ఉండగా రెవెన్యూ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీ లించారు. ఆయన వెంట ఏపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ రిజ్వానుల్లా, వైసిపి సీనియర్ నాయకులు ఆగామోహిద్దిన్, మండల సర్వేయర్ డేవిడ్, విఆర్ఓ విజ్ఞాన్‌లు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం పంపిణీ

మదనపల్లెక్రైం, డిసెంబర్ 13 ప్రభాతవార్త:



క్షయ వ్యాధిగ్రస్థులకు మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో మంగళవారం పోషకా హారం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఆంజనేయులు మాట్లా దుతూ ప్రధానమంత్రి టీబి ముక్త భారత్ అబియాన్ నిక్షయ్ మిత్ర పథకం ద్వారా పౌష్టికాహారం సాయం అందిం చడం కోసం ఆరోగ్యశాఖ 2022లో ప్రారంభించిందన్నారు. క్షయరోగు లకు మానవతా దృక్పదంతో ప్రతి ఇక్కరూ తమ బాధ్యతగా ఒక టిబిరోగికి ఆరునెలల పాటు దత్తత తీసుకొని పౌష్టికాహారం అందజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మదన పల్లె టిబి యూనిట్‌పరిధిలో 46మందికి దాతల సహకారంతో ఆహారం అంద జేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరిండెంట్‌తో పాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, టిబి విభాగం మదనపల్లె సిబ్బంది, దయాలన్ ప్రభాకర్, సుశీల, వనజకుమారి, జ్ఞాన తిలగం పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించండి : ఎమ్మెల్యే

మదనపల్లెక్రైం, డిసెంబర్ 13 ప్రభాతవార్త:



ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే నవాజ్ బాషా సూచించారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఓపి గదుల వద్దన ఇలబడి ఉన్న రోగులను పరామర్శించారు. ఆయా విభాగాలను తనిఖీ చేసి సేవలపై ఆరా తీశారు. అనం తరం మెడికల్ సూపరింటెండెంట్ చాంబర్లో డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. జ్వర బాధితులకు తొలుత వ్యాధి నిర్ధారణ పరీక్ష చేసి మెరు గైన వైద్యం అందించాలని సూచించారు. సాధారణ, హైరిస్క్ కేసులను రెఫర్ చేస్తుండడంతో మరణాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. టెస్టుల కోసం ప్రైవేటు ల్యాబులకు పంపుతున్నట్లు తెలిసిం దన్నారు. ఆసుపత్రిలో ల్యాబ్ అందుబాటులో ఉన్నా ప్రవైటే ల్యాబులకు పంపడం ఏంటని ప్రశ్నించారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీకి వర్తించే కేసులను సైతం ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేయడం ఎంటని మండి పడ్డారు. అన్ని రకాల కాన్పులు, శస్త్రచికిత్సలు ప్రభుత్వాసుపత్రిలోనే జరగా లని అన్నారు. అనంతరం వార్డుల్లో పర్యటించి రోగులను పరామర్శించి, వైద్య సేవ లపై ఆరా తీశారు. ఆసుపత్రిలో డ్రైవర్ల అడగాలు మితిమీరినా పట్టించు కోకపోవ డం ఏంటని ప్రశ్నించారు. డ్రైవర్ల దందాను అరికట్టి గొడవల నివారణకు చర్యలు తీసుకోవాలంటూ రెండవ పట్టన సిఐ మురళీక్రిష్ణకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో గొడవలకు దిగితే చర్యలు : సిఐ

మదనపల్లెక్రైం, డిసెంబర్ 13 ప్రభాతవార్త:



వాహన డ్రైవర్లు ఆసుపత్రిలో గొడవ లకు దిగితే చర్యలు తప్పవని రెండవ పట్టణ సిఐ మురళీ క్రిష్ణ హెచ్చరించారు. ఆసుపత్రిలో అంబులెన్స్ డ్రైవర్లు, సెక్యూ రిటిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా సిఐ మాట్లాడుతూ అంబులెన్స్ వాహనదారులు అసుపత్రిలో తిష్ట వేసి అధిక అద్దె వసూలు చేసి రోగుల జేబులకు చిల్లులు పెడుతున్నట్లు ఫిర్యా దులు వచ్చాయన్నారు. పైగా బాడుతల కోసం గొడవలకు పాల్పడుతూ రోగులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. త్వరలో వాహనాల అద్దెలను నిర్ణయించి సీరియల్ పెడుతామని సూచించారు. నిబంధనలు పాటించని డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గొడవలకు పాల్పడి రోగులను ఇబ్బంది పెడితే అరెస్టు చేసి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. నిబంధనల మేరకు వాహనాలు నడపా లని సిఐ సూచించారు.

## ప్రజా ప్రతినిధులు అభివృద్ధి ప్రణాళికతో రండి : ఎంపిడిఓ

తంబళ్లపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలోని సర్పంచులు ఎంపీ టీసీలు, ప్రజా ప్రతినిధులు ఈనెల 15న తమ ప్రాంత అభివృద్ధి పనులు ప్రణాళికలపై అవగాహన కలిగి ఉండా లన్నారు. హాజరు కావాలని ఎంపీడీవో ఆనంద్ కుమార్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లా దుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను అభివృద్ధి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులకు ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ అనసూయ, మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, ముకల చెరువు మూర్కెట్ కమిటీ ఛైర్మన్ రజని సురేంద్ర, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు భార్గవరెడ్డి, మల్లయ్య కొండ ఛైర్మన్ కేఆర్ మల్‌రెడ్డి, ఆర్‌బీకే ఛైర్మన్ రెడ్డి మల్‌రెడ్డి, వైకాపా మండల అధ్యక్షుడు రేపన చౌడేశ్వర, పద్మశాలి రాష్ట్ర డైరె క్టర్ సురేంద్రనాథ్ హాజరవుతారని మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

## భూముల రీ సర్వే పారదర్శకంగా చేయండి

తంబళ్లపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలంలోని సచివా లయ సర్వేయర్లు, వీఆర్వోలు, ఇంజి నీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే పారదర్శకంగా నిర్వహిం చాలని తహసీల్దారు కళావతి సూచించారు. భూములు సర్వేలో రైతుల నుంచి వచ్చే చిన్న చిన్న సమస్యలను అక్కడి కక్కడే పరిష్కరించాలని అన్నారు. అన్న దమ్ముల సమస్యలు, రాళ్ల ఏర్పాటు, భూముల వద్ద తకరార్లు రాకుండా శాశ్వ తంగా భవిష్యత్తులో భూ వివాదాలకు చెక్ పెట్టడానికి ప్రవేశపెట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్‌కుమార్, మండలసర్వేయర్ సుబ్రమణ్యం, సచివాలయ సర్వే యర్లు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## హౌసింగ్ ఏఈగా అమరనాథ్

నిమ్మనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండల గృహ నిర్మాణ సంస్థ ఏఈగా నూతనంగా అమరనాథ్ బాధ్యతలుచేపట్టారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు, సరైన సమయంలో లబ్దిదారులకు బిల్లులు చెల్లించేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. ఇక్కడ పనిచేసిన ఏఈ వెంకట రెడ్డి కురబలకోట మండలానికి బదిలీ అయ్యారు.

## విస్తృతంగా ప్రవహిస్తున్న బాహుదా...గేట్లు ఎత్తివేత

నిమ్మనపల్లె, డిసెంబర్ 13 ప్రభాతవార్త:

మండల పరిధిలోని ముష్టూరు గ్రామంలో నెలకొన్న బాహుదా ప్రాజెక్టు నుంచి మంగళవారం 1200 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీహరిరెడ్డి తెలిపారు. మాండూస్ తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా ఎడతెరపులేని వర్షాలకు బాహుదాలోని నాలుగు గేట్లను ఎత్తివేశారు. దిగువకు నీటిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. బాహుదా పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## 15న శ్రీవారి కల్యాణం

కడప కార్పొరేషన్, డిసెంబరు 13, ప్రభాతవార్త:

శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంక టే శ్వర స్వామి వారి కల్యాణం ఈనెల 15న గురువారం కడప కళాక్షేత్రంలో వైభ వోపే తంగా జరగనుంది. స్వామి వారి కల్యాణో త్సవం, పుష్పయాగం, గ్రామోత్సవం, శ్రీవేంకటేశ్వర గోవింద మాల భక్త బృందం నిర్వహిస్తున్నారు. ఈనెల 27న ఉదయం 7 గంటలకు దేవుని గడప శ్రీవేంకటేశ్వర ఆలయం నుంచి తిరుమ లకు పాదయాత్రగా గోవిందమాల భక్త బృందం పాదయాత్రగా వెళ్లనున్నారు.

## అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటు

ప్రొద్దుటూరు డిసెంబర్ 13, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణం తాత్కాలిక కూరగాయల మార్కెట్ సమీపాన వెలసిన పెద్దమ్మ ఆలయం లో యంఆర్పీఎస్ స్టేట్ కన్వీనర్ సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో పట్టణంలోని అయ్యప్ప స్వాములకు మం గళవారం మధ్యాహ్నం బిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వా ములు సుమారు 500ల మంది బిక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాదిగ మాట్లాడుతూ ఎంతో పవిత్రంగా నియమనిష్టలతో భక్తిశ్రద్ధ లతో స్వామి మాల ధరించిన స్వాములకు ఏర్పాటు చేసిన బిక్షను స్వీకరించడం తన అదృ ష్టముగా భావిస్తున్నానన్నారు. మంగళవారం అమ్మవారికి. ప్రధానం కావడంతో బిక్ష ఏర్పాటు చేశానన్నారు. కార్యక్రమానికి పూర్తిగా సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి , మున్సిపల్ వైస్ ఛైర్మెన్ పాథ కోట బంగారు మునిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి , పూసల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్య క్షులు ఖమ్మం వెంకటేశ్వర్లు, 6వ వార్డు వైసీపీ కార్యకర్తలు చీటీల సుబ్బరాయుడు ,నామాల సుధాకర్, అమ్మలదిన్నె లక్ష్మీనారాయణ, కాంక్రీట్ మేస్త్రి సత్తిరాజు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను మభ్యపెట్టడం తగదు : వైసిపి

ప్రొద్దుటూరు డిసెంబర్ 13, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టిడిపి నాయకులు ప్రతి ఇంటి దగ్గరికి వెళ్లి కరెం టు స్తంభం కాలువలు లాంటివి ఏర్పాటు చేస్తామని ప్రజలకు మాయ మాట లు చెప్పి మభ్యపెట్టి టిడిపి టెలిగ్రామ్ గ్రూపులో చేర్చేందుకు ప్రయత్నం చేయడం టిడిపి నాయకులకు తగదని కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యా లయంలో ఆయన మాట్లాడుతూ ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని చేస్తున్న టిడిపి నాయకులు ముఖ్య మంత్రిగా చంద్రబాబు ప్రజలకు ఎలాంటి మేలు చేసినవి చెప్పడానికి ధైర్యం లేక మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు ధైర్యం ఉంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రజలకు చేసిన మేలేంటో వివరించాలని సూచించారు గతంలో చంద్రబాబు ప్రజ లకు చేసింది ఏమీ లేదు కాబట్టి ఏమి చెప్పుకోలేక కరెంటు స్తంభం కాలువ నిర్మి స్తామని మాయమాటలతో టిడిపి నిర్వహిస్తున్న వాట్సాప్ గ్రూపులో చేర్పించా లను కోవడం సిగ్గుచేటు అన్నారు. సమా వేశంలో 35వ కౌన్సిలర్ బాలాజీ పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

చాపాడు డిసెంబర్ 13, ప్రభాతవార్త



భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకే విద్యార్థులకు ప్రభుత్వం విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు మండల తహసీల్దార్. జె .ఎస్. సుభాని. ఎంపీడీవో శ్రీధర్ నాయుడులు తెలిపారు. చాపాడు జిల్లా పరిషత్ హైస్కూలు నందు మంగళవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు గౌస్ మోదిన్ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ పోటీలను తహసీల్దారు సుభాని ప్రారం భోత్సవం చేశారు. ఈ సందర్భంగా నేటి విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలు కావాలని పలువురు ప్రముఖుల ఆకాంక్షిం చారు. ఈ ప్రదర్శనలలో నరహరిపురం. చాపాడు. అన్నవరం. చాపాడు కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు. జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోగ్రెసివ్ ఫౌండేషన్ అధ్యక్షుడు చాపాటి రామ సుధాకర్‌రెడ్డి. ఐదు మంది విద్యార్థులకు500 ప్రోత్సాహంతో పాటు మెమెం టోలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు. ఉపా ధ్యాయులు హాజరయ్యారు.

## తప్పుడు మ్యూటేషన్ చేసిన భూములను ఆన్‌లైన్‌లో ఉంచాలని డిమాండ్

ప్రొద్దుటూరు డిసెంబర్ 13, ప్రభాతవార్త



కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పొట్లదుర్తి గ్రామం పరిధిలో తప్పుడు మ్యుటేషన్ చేసిన భూములను తిరిగి ఆన్లైన్లో ఉంచాలని కడప జిల్లా జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షులు పల్లె రమేష్ డిమాండ్ చేశారు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పొట్లదుర్తి గ్రామనివాసి సార్ రెడ్డి కుల్లాయి రెడ్డికి సంబంధించి పొట్లదుర్తి గ్రామ సర్వేనెంబర్ 828/2లో 80 సెంట్లు , 829 సర్వే నంబర్ లో 97 సెంట్లు విస్తీర్ణం గల వ్యవసాయ భూమిని సంబంధిత రెవెన్యూ అధికారులు ఎలాంటి ఆధారాలు లేకుండా కుల్లాయి రెడ్డి తాత ఆస్తిని కుల్లాయి రెడ్డి తండ్రి ఆస్తిని ఇతరులకు మ్యుటేషన్ చేశారని తెలిపారు తక్షణమే సారెడ్డి కుల్లాయి రెడ్డి భూములను తిరిగి వారికి ఆన్లైన్లో ఉంచాలని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో ఎర్రగుంట్ల తాసిల్దార్ కార్యాలయం ఎదురుగా నిరసన కార్య క్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సారెడ్డి కుళాయి రెడ్డి మాట్లాడుతూ తన పెద్దల నుండి సంక్రమించిన భూములను తిరిగి తనకు ఇప్పించి ఆన్లైన్లో పొందుపరిచి తనకు న్యాయం చేయా లని అధికారులను కోరారు.

ఎర్రగుంట్ల తాశీల్దారు వివరణ : తప్పుడు మెడిటేషన్ పై ఎర్రగుంట్ల తాసిల్దార్ ఫోన్లో మాట్లాడుతూ దీనిపై విచారణ చేస్తున్నామని ఇరివురికి నోటీసులు కూడా ఇచ్చామని త్వరలోనే సమస్యకు పరిష్కారం చూస్తామని తెలిపారు.

## కూలిన విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్లు, స్థంబాలు

### యుద్ధప్రాతిపదిక పనులు

కురబలకోట, డిసెంబర్ 13 ప్రభాతవార్త :



మాండూస్ తుఫాన్ వల్ల మండలంలో ట్రాన్స్‌కో కు చెందిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, స్థంబాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌కో సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించ దంతో ఎలాంటి ప్రాణాప్రాయం జరగ లేదు. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతినగా, మట్లివారి పల్లె గ్రామంలో విద్యుత్ స్థంభా లు నేలకొరిగాయి. పలుచోట్ల లైన్లుపై కొమ్మడిపడి ట్రిపుకావడంతో ట్రాన్స్‌కో సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలుచేపట్టి నూతన స్థంభాలనే నాటి, ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్‌సరఫరాను యదావిధిగా నిర్వహించారు. ట్రాన్స్‌కోకు రూ.50వేలు నష్ట వాటిల్లినట్లు ట్రాన్స్‌కోలైన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపారు. మండలంలో ఈ వర్షానికి కుంటలు, చెక్‌డ్యాంలు చెరువుల్లోకి కొద్దిపాటి వర్షం చేకూరింది.

## మెకానికల్ రంగంలో ఉద్యోగ అవకాశాలు మెండు

కురబలకోట, డిసెంబర్ 13 ప్రభాతవార్త:



మెకానికల్ రంగంలో ఉద్యోగ అవకా శాలు మెండుగా ఉన్నాయని గెస్ట్‌లెక్చర్ విఆర్ దీరజ్ తెలిపారు. మంగళవారం మిట్స్ కళాశాలలో ఈఎస్ఈలోమెకానికల్ ఇంజనీరింగ్ ఉద్యోగాలపై అమెరికాకు చెం దిన అబోర్ట్ ర్యాపిడ్ డయాస్నికి సిస్టన్స్ కంటూన్యూస్ ఇంప్రూవ్‌మెంటు ఇంజ నీరు విఆర్ ధీరజ్ ముఖ్య ఉపన్యాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పోటీ ప్రపంచంలో ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన సాంకేతిక పద్దతు లపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏ రంగంలోనైనా మెకానికల్ ఇంజ నీరింగ్ ద్వారానే ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. మార్కెట్ లోకి వచ్చే నూతన టెక్నాలజీలపై విద్యార్థులు అవగాహన పెంపుపై దృష్టి సారిం చాలన్నారు. ప్రపంచంలోని అమెరికా వంటి పెద్ద నగరాల్లో మెకానికల్ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువుగా లభిస్తాయని విద్యార్థులు ఐటికన్నా మెకానికల్ వైపు మొగ్గుచూపాలన్నారు. సదస్సులో రిలేషన్స్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ శివయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు గంగమ్మ జాతర వేలం పాట

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 13, ప్రభాతవార్త:

2023 ఫిబ్రవరి నెల 20, 22 వరకు జరిగే గంగమ్మకు జాతర సంబం ధించి తలనీలాలు కొబ్బరి కాయలు టోల్ గేటులకు నేడు గంగమ్మ జాతరలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సామల నరసింహారెడ్డి, ఈవో రవీంద్రరాజు తెలిపారు. ఈ వేలం పాట గంగమ్మ జాతర దేవాలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఎనిర్వహించబడుతుందని తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.50వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. పాట ముగిసిన తరువాత పాట దక్కని వారికి తిరిగి తమ డబ్బు వాపసు ఇస్తామని తెలిపారు. పాట దక్కించుకున్న వారు డబ్బులు చెల్లించాలన్నారు.

## మహిళా పోలీసుల సేవలు అభినందనీయం

కడప క్రైం, డిసెంబరు 13, ప్రభాతవార్త:



బాల్య వివాహాలు అరికట్టడంలో, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో మహిళా పోలీసుల సేవలు అభినందనీయ మని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో ఇటీవల విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది మహిళా పోలీసులను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయా వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తించే మహిళా పోలీసులు స్కూలు డ్రాపౌట్స్ గుర్తించి తిరిగి స్కూళ్లలో చేర్పించేలా కృషి చేయడం ఈవ్ టీజింగ్, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యక్రమాల గురించి క్షేత్ర స్థాయి లో ఆరా తీసి ఉన్నతాధికారుల గురించి క్షేత్రస్థాయిలో ఆరా తీసి ఉన్నతాధికారు లకు సమాచార మివ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడి, దిశ డీఎస్పీ వాసుదేవన్, జిల్లా డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

## జీతాలు ఇవ్వలేని ప్రభుత్వానికి పాలనార్హత లేదు

### - టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి

కడప వైద్య విభాగం, డిసెంబరు 13, ప్రభాతవార్త:



ఏపీలో ఉద్యోగుల, పెన్షనర్లకు వేత నాలు 13వ తేదీ వచ్చినా వారి ఖాతాలో ఇంకా జమ కాకపోవడం ఎంత దారుణ మో, ఇది ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనమని టీడీపీ జిల్లా ప్రధాన కార్య దర్శి వికాస్ హరికృష్ణ ఆరోపించారు. జీతాలు చెల్లించలేని ప్రభుత్వానికి పాలించే అర్హత లేదని ధ్వజమెత్తారు. జిల్లా తెదేపా కార్యాలయంలో మంగళవారం విలే క రుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వంలో రాష్ట్ర విభజన జరి గే రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీ జీతాలు ఇచ్చేవారన్నారు. ప్రతిపక్షంలో ఉన్న జగన్ సీఎం అయ్యాక ఇచ్చిన వాగ్దానాలు మరిచి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ జిల్లా మీడియా కోఆర్డినేటర్ జనార్ధన యాదవ్, సాధికార కమిటీ జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## మైనార్టీల ద్రోహి సీఎం జగన్

కమలాపురం, డిసెంబరు 13, ప్రభాతవార్త:



మైనార్టీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్ అని జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా ధ్వజమెత్తారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహా రెడ్డి నివాసంలో కమలాపురం ఎనియోజకవర్గ మైనార్టీ నాయకులతో కలిసి ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నప్పటి నుంచి మైనార్టీ పథకాలను రద్దు చేసి పూర్తిగా మైనార్టీల సంక్షేమాన్ని గాలికి వదిలే శారన్నారు. మైనార్టీ పేదల కోసం మాజీ సీఎం చంద్రబాబునాయుడు దుల్హన్ పథకం ప్రవేశపెట్టి మైనార్టీ ఆడబిడ్డల పెళ్లికి రూ.50వేలు ఆర్థిక సాయం చేసే వారని, ఈ పథకం ద్వారా ప్రతి మైనార్టీ పేద వారికి పథకం అందేదని వైసీపీ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా రద్దు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మైనార్టీ సబ్సిడీలోన్లు, విదేశీ విద్య, రంజాన్ తోఫాను నిర్వీర్యం చేశారని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు హైదర్‌బాషా, మహబూబ్‌బాషా, సద్దాం హుసేన్, ఆసీఫ్ ఖాన్, హుసేన్‌ఖాన్, కమలాపురం నియోజకవర్గ మైనార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాయపడిన పుత్తా పెద్ద ఎల్లారెడ్డిని పరామర్శించిన పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం, డిసెంబరు 13, ప్రభాతవార్త:



కమలాపురం మండలం గంగవరం, విభరాపురం గ్రామానికి చెందిన పుత్తా పెద్ద ఎల్లారెడ్డిపై కొద్ది రోజుల కిందట అర్ధరాత్రి కత్తితో దాడి జరిగిన విషయం విధితమే. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి అనారోగ్యం కారణంగా మెరుగైన వైద్యం కోసం తిరుపతిలో చికిత్స పొంది ఇంటి కి తిరిగి వచ్చిన సందర్బంగా మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి టీడీపీ ఉపాధ్య క్షుడు పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా పుత్తా ఆయనను త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మండల టీడీపీ నాయకులు దివాకర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రాఘవరెడ్డి, పుత్తా ఎల్లా రెడ్డి, సుబ్బారెడ్డి, ఐటీడీపీ అబ్దుల్‌నబీ, చిన్న ఎర్రబల్లె సుబ్బారెడ్డిలు, ఐటీ డీపీ నరసింహులు ఉన్నారు.

## ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

కమలాపురం, డిసెంబరు 13, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణంలో ఉన్న ప్రభు త్వ సర్వజన ఆసుపత్రిని మంగళ వారం ముద్దనూరు డిప్యూటీ కలెక్టర్ రామూ నాయక్, కమలాపురం తహసీల్దారు అమ రేశ్వరి తమ సిబ్బంది సుధాకర్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు తనిఖీ చేసి సిబ్బంది హాజరుపట్టి ప్రకారం సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా అని ఆరా తీశారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల గురించి డాక్టర్ శేఖర్, డా.సునీల్, డా.ఉమామహేశ్వరి, డా.హాఫియాను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ల్యాబ్‌టెక్నీషియన్, నర్సులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన దృష్టికి తేవడంతో నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి భర్తీ చేస్తామని తెలిపారు.

## ఎర్రగుంట్లలో పారిశుధ్య వారోత్సవాలు

ఎర్రగుంట్ల, డిసెంబర్ 13, ప్రభాతవార్త



ఎర్రగుంట్ల పట్టణ పరిధి వేంపల్లి రోడ్డు లోని మెప్మా కార్యాలయం నందు పారిశుద్ధ్య వారోత్సవాలు మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత పై యూనిసెఫ్ వారితో కలిసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల 50 శాతం వ్యాధులు రాకుండా అరికట్టుకోవచ్చని దీనిపై ప్రజలకు మెప్మా సభ్యులు, డ్వాక్రా ఆర్పీలు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. అరక్షితమైన నీటిని తాగి ప్రజలు చాలా వ్యాధుల బారిన పడు తున్నారని కావున నీటిని కాచి వడగట్టుకుని తాగాలని, పిల్లలలో 90 శాతం డయేరియా వల్ల చనిపోతున్నారని పరిశుభ్రంగా ఉంటే డయేరియా రాదని, వీటి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తో పాటు మెప్మా మేనేజర్ గోపీనాథ్, కో ఆప్షన్ మెంబర్ సూర్యనారాయణ రెడ్డి, సి ఓ వసంత్ కుమార్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మధుసూదన్, హెల్త్ అసిస్టెంట్ రాంప్రసాద్, మెప్మా సిబ్బంది, డ్వాక్రా ఆర్పీలు పాల్గొన్నారు.

